క్లుప్తంగా

ఫిర్యాదులు చేస్తే చర్యలు

కావలి : చిరుతిళ్లకు సంబంధించి వివరాలను ముద్రించకుంటే ఫిర్యాదు చేయాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ కరిముల్లా మంగళవారం చెప్పారు. తూకాలు, కొలతల్లో తేడాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. కావలి డివిజన్ పరిధిలో 2017లో 105 కేసులు నమోదు చేసి రూ.5.86 లక్షలు జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. ఇలా 2018లో 154 కేసులకు రూ.10.83 లక్షలు, 2019లో 110 కేసులకు రూ.11.30 లక్షలు, 2020లో 120 కేసులకు రూ.12.39 లక్షలు, 2021లో 208 కేసులకు రూ.13.10 లక్షలు, 2022లో 143 కేసులకు రూ.11.99 లక్షలు, 2023లో 126 కేసులకు రూ.11.93 లక్షలు, 2024లో 86 కేసులకు రూ.9.66 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు నరికివేత

కలిగిరి: తూర్పుదూబగుంట గ్రామంలోని అగ్రిగోల్డ్ భూముల్లో ఎర్రచందనం దుంగలను నరికివేయడంపై కలిగిరి ఎస్సై ఉమాశంకర్ మంగళవారం కేసు నమోదు చేశారు. అగ్రిగోల్డ్ భూముల్లోని కొన్ని దుంగలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు సూపర్‌వైజర్ నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు అక్కడ వదిలేసి వెళ్లిన దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు పోటీలు



కావలి : పట్టణంలోని గొల్లమూడివారి వీధిలో ఉన్న నలంద ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు భారత సంస్కృతి ప్రతిష్ఠాన్ వారు మంగళవారం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. టౌన్ స్థాయిలో మొదటి బహుమతి పీవీ రాఘవి, రెండో బహుమతి పి.యశశ్విని, మూడో బహుమతి ఆర్.హేమ స్వజన్ నిలిచారు. వారికి ఎంఈఓ గోవిందయ్య చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ ఎండీ వాసీం అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

మర్రిపాడు : కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మర్రిపాడు నుంచి డీసీపల్లి వైపు కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను కడప నుంచి నెల్లూరు వెళ్తున్న కారు నందవరం పాట్లు ఫ్యాక్టరీ వద్ద హైవేపై ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి గాయపడిన వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ కిట్ అందజేత



దుత్తలూరు : దుత్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి బి.మనోజ్ క్రికెట్ కిట్‌ను వితరణ చేయగా ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వర్లుకు మంగళవారం అందజేశారు. మనోజ్ తండ్రి దివంగత మనోహర్‌రావు ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశారు. ఆయన జ్ఞాపకార్థం క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



ఉదయగిరి : మండలంలోని గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వారు పరిశుభ్రతపై మంగళవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బీఎం శోభన్ బాబు బహుమతులు అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా



ఆత్మకూరు : ఆత్మకూరుకు వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మున్సిపల్ పరిధిలోని బట్టేపాడు మార్గంలో మంగళవారం చోటుచేసుకుంది. పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక రద్దు

ఉదయగిరి : బీజేపీ ఉదయగిరి మండల కమిటీ అధ్యక్షుడి ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి హనుమారెడ్డి మంగళవారం తెలిపారు. రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదం నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడి ఆదేశాల మేరకు త్వరలో ఎంపిక నిర్వహిస్తామని వివరించారు.

వైద్యం.. గగనం

గ్రామాల్లోని పేదల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేయాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత వేధిస్తుండగా, మరికొన్ని చోట్ల మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు మరీ అధ్వానంగా తయారైంది. అంతే కాకుండా ఆస్పత్రుల్లోని స్ట్రెచర్, కుర్చీలు కూడా దెబ్బతిని ఉన్నాయి. 104 వైద్యసేవలు, పింఛన్ వెరిఫికేషన్ అంటూ కొందరు వైద్యులు క్షేత్రస్థాయిలో తిరుగుతుండగా పీహెచ్‌సీలో ఒకరిద్దరి డాక్టర్లు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. మంగళవారం సాక్షి విజిట్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై కథనం.

సాక్షి విజిట్

పీహెచ్‌సీల్లో సమస్యల తిష్ట

- సమయపాలన పాటించని వైద్యాధికారులు
- వసతులు అంతంత మాత్రమే

ఆత్మకూరురూరల్ : మండలంలోని మహిమలూరులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటలకు వైద్యులు రావాల్సి ఉండగా, వైద్యాధికారి డాక్టర్ అనూషా 9.45 గంటలకు ఓపీలో ఉన్న రోగులకు వైద్య పరీక్షలు ప్రారంభించారు. ఆ సమయానికి ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌తో పాటుగా స్టాఫ్ నర్సు పెంచలమ్మ, ఫార్మాసిస్ట్ పవన్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమౌళి అందుబాటులో ఉన్నారు. మొత్తం మీద మంగళవారం 65 మంది రోగులను పరీక్షించి వైద్య సహాయం అందజేశారు.

కాంపౌండర్ ఒక్కరే డ్యూటీలో..

మహిమలూరులోని ప్రభుత్వ యునాని వైద్యశాలలో కాంపౌండర్ లక్ష్మీప్రసన్న ఒక్కరే 9.30 గంటల నుంచి అందుబాటులో ఉన్నారు. అదే కార్యాలయంలో పనిచేస్తున్న డాక్టర్ అబ్దుల్ రజాక్ హాజరుకాలేదు. దీనిపై మంగళ, గురు, శనివారాల్లో పట్టణంలోని యునాని వైద్యశాలలో విధుల్లో ఉంటారని తెలిసింది. మరో ఉద్యోగి చలపతిరావు అనుమసముద్రంపేట మండలంలో విధి నిర్వహణలో ఉన్నట్టు ఆమె తెలిపారు.



దుత్తలూరు పీహెచ్‌సీ ప్రాంగణంలో పిచ్చిచెట్ల మధ్య నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

పనివేళలు పాటించని సిబ్బంది

- యునాని వైద్యశాలలో డాక్టర్ మాత్రమే, సిబ్బంది లేరు
- మందులకూ కొరతే..

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్ పక్కనే ఉన్న యునాని వైద్య ఆస్పత్రిని 'సాక్షి' 9 గంటల సమయంలో విజిట్ చేసింది. యూపీహెచ్‌సీలో ఓపీ చూసే ఉద్యోగిని మాత్రమే ఆ సమయానికి వచ్చారు. అప్పటికి పేషెంట్లు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రిలో షుగర్ పరీక్షలు నిర్వహించేందుకు 9 గంటల్లోపే విధులకు రావాల్సి ఉంది. షుగర్ పరీక్షలు తినకముందు, తిన్న తరువాత గంటన్నరకు పేషెంట్లకు టెస్ట్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే సంబంధిత ఉద్యోగి 9.50 గంటలకు విధులకు వచ్చారు. ఫార్మాసిస్ట్ 9.40 గంటలకు వచ్చారు. తరువాత ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు ఆశా కార్యకర్తలు విధులకు హాజరయ్యారు. డాక్టర్ ఎస్‌కే అస్మా 10.20 గంటలకు విధులకు వచ్చారు. అప్పటికి పేషెంట్లు 12 మంది ఉన్నారు. వారికి డాక్టర్ ఒక్కొక్కరుగా పరీక్షలు నిర్వహించి మందులు రాసిచ్చారు. ఈ ఆస్పత్రిలో మరో స్టాఫ్ నర్సు, ఎల్‌జీఎస్ ఖాళీలు ఉన్నాయి. రోజుకు పేషెంట్లు 50 మందికిపైగా ఓపీ నమోదు అవుతుంది. మంగళవారం 48 ఓపీ నమోదైంది. ఇదే ప్రాంగణంలోని యునాని వైద్యశాలలో డాక్టర్ అబ్దుల్ రజాక్ 9.20 గంటలకు విధులకు వచ్చారు. అయితే అక్కడ ఆయన ఒక్కరే ఉండడం, ఏడాది నుంచి సిబ్బందిలేరని అన్నీ ఆయనే చూస్తున్నారు. ఇక్కడ మోకాళ్ల నొప్పులు, నరాల బలహీనత, మైగ్రేన్ తలనొప్పి, తదితర వాటికి పరీక్షలు, సలహాలు డాక్టర్ ఇస్తున్నా పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో లేవని డాక్టర్ తెలిపారు. ఏడాదికి ఒకసారి మందులు సరఫరా అవుతాయని తెలిపారు. దీనికితోడు ఈ డాక్టర్ మొదటి వారంలో మంగళ, గురు, శనివారాల్లో ఆత్మకూరులో, సోమ, బుధ, శుక్రవారాల్లో మహిమలూరు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. భవన వసతి ఉన్నా పూర్తి స్థాయిలో సిబ్బంది, మందులు లేకపోవడంతో సరైన యునాని వైద్య చికిత్సలు అందించలేని పరిస్థితి.



ఉదయం 9:20 గంటలకు ఓపీ నమోదు చేసే సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్న వైనం

ఎక్విప్‌మెంట్ కొరత

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 9 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 8 మంది ఉన్నారు. స్టాఫ్ నర్సు లేక వైద్యం కొరత ఉంది. అయితే ప్రధాన వైద్యశాలలో జరగాల్సిన డెలివరీలో ఎక్కువ శాతం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలిపోతున్నాయి. ఆపరేషన్ థియేటర్‌లో ఎక్విప్‌మెంట్ లేకపోవడం వల్ల ఆపరేషన్లు చేయలేని పరిస్థితుల్లో వైద్యులు ఉన్నారు. కాగా మంగళవారం 104 వైద్యసేవల నిమిత్తం వైద్యాధికారి మంజులమ్మ చందులూరుపాడుకు వెళ్లగా మరో డాక్టర్ సురేష్‌బాబు 9.30 గంటలకు వైద్యశాలకు చేరుకుని రోగులకు వైద్యసేవలు అందించారు.



తుప్పుపట్టిన స్ట్రెచర్

వేధిస్తున్న సమస్యలు

దుత్తలూరు : దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. చాలా ఏళ్ల క్రితం కట్టిన మరుగుదొడ్లు కావడంతో లోపలి భాగాలు శిథిలమై నీరు నిలిచి ఉపయోగానికి పనికిరాకుండా పోయాయి. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దుత్తలూరు వైద్యశాల పరిసర ప్రాంతాలు పిచ్చిచెట్లతో నిండి భయానక వాతావరణం నెలకొంది. పారాసిటమాల్, సిట్రిజన్ మాత్రల కొరత ఉంది. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారిణి గత ఆరు నెలలుగా మెటర్నిటీ సెలవులో ఉండటంతో కొత్త వైద్యాధి కారి విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే క్షయ రోగులకు అందిస్తున్న నగదు కొన్ని నెలలుగా ఆగిపోయింది. స్ట్రెచర్, నీటి సమస్య ఉంది. ఇక్కడ పనిచేస్తున్న యూడీసీ సరిగ్గా విధులకు రావడం లేదు. నూతన లేబొరేటరీ భవనం నిర్మించినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో త్రీఫేజ్ సరఫరా లేదని సిబ్బంది తెలిపారు.

అంతంత మాత్రమే



ఇటీవలి కాలంలో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నా. కొంత మేర ఇక్కడ అందించే వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

– మద్దినేని మహాలక్ష్మమ్మ, మహిమలూరు, ఆత్మకూరు మండలం

ఫైలేరియాతో బాధపడుతున్నా



గత 20 ఏళ్లుగా ఫైలేరియాతో బాధపడుతున్నా. ప్రతినెలా ఇక్కడికి వచ్చి మందులు తీసుకుంటా. కొన్ని సందర్భాల్లో వైద్యులు ఉండడం లేదు. అలాంటి సందర్భాల్లో సిబ్బందే మందులు ఇస్తున్నారు.

– పి.సుబ్రహ్మణ్యంరెడ్డి, బోడిపాడు

కొన్నిసార్లు ఆలస్యంగా వస్తున్నారు



నెలకు రెండు లేదా మూడు సార్లు ఇక్కడికి వచ్చి వైద్యం చేయించుకుంటా. నాకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తారు. కొన్నిసార్లు సిబ్బంది రాక ఆలస్యమవుతోంది.

– బత్రెల నరసమ్మ, చేజర్ల

సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తే మేలు



కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బిట్రగుంట : బోగోలు మండలంలోని కోవూరుపల్లి పీహెచ్‌సీలో నలుగురు డాక్టర్లు ఉండగా ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ముగ్గురు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరు 104 సేవల కోసం వెళ్తుండడంతో ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు రోగులకు సేవలందించే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో అన్ని వసతులు, విశాలమైన స్థలం, భవనాలు అందుబాటులో ఉన్నా సీహెచ్‌సీగా అభివృద్ధి చేసే ప్రతిపాదన మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. సీహెచ్‌సీగా అభివృద్ధి చేస్తే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉన్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో రోగులు కూడా అంతంత మాత్రంగానే ఆస్పత్రికి వస్తున్నారు. కాగా మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు సుమారు 40 ఓపీ నమోదైంది. వీటిలో ఇద్దరు, ముగ్గురు జ్వరంతో బాధపడుతూ రాగా మిగిలిన వారు షుగర్, బీపీ, గ్యాస్ట్రిక్ వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో వచ్చారు. వీరికి వైద్యులు ప్రవీణ్, జీహారికలు మందులు ఇచ్చి పంపించారు. వాస్తవానికి హైవేకి దగ్గరలో ఉన్న కోవూరుపల్లి పీహెచ్‌సీకి రాత్రి సమయంలో వైద్యుల అవసరం ఉంది. ప్రస్తుతం ఆస్పత్రి పీహెచ్‌సీ హోదాలోనే ఉండటంతో వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే వైద్యసేవలందించే అవకాశం ఉంది.

తాకిడి ఎక్కువ.. వసతులు తక్కువ

చేజర్ల : మండల కేంద్రమైన చేజర్ల ప్రభుత్వ వైద్యశాలలో రోగుల తాకిడి ఎప్పుడూ అధికంగా ఉంటుంది. ప్రస్తుతం చలికాలం కావడంతో సాధారణంగా కంటే మంగళవారం ఎక్కువ మంది రోగులు వచ్చారు. ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులు ఉండగా, ఇద్దరూ మహిళలే. డాక్టర్ మెహతాబ్ 10 గంటలను రాగా మరో డాక్టర్ కీర్తిప్రియ 10.20 నిమిషాలకు వచ్చారు. వీరు సుమారు 92 మంది రోగులను పరీక్షించారు. అందులో 40 మంది బీపీ, షుగర్ ఉండగా, వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందించారు. ఆస్పత్రిలో పబ్లిక్ హెల్త్ నర్సు, మేల్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రోగులు నిత్యం వస్తున్నారు. అందుకు తగినట్లు ఆస్పత్రి పరిసరాలు సక్రమంగా లేని కారణంగా రాత్రి వేళల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

నామమాత్రంగా ప్రసవాలు

వరికుంటపాడు : వరికుంటపాడు పీహెచ్‌సీలో కాన్పులు నామమాత్రంగా జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు పథకం ద్వారా ఇక్కడి పీహెచ్‌సీని ఆధునికీకరించి తగినంత సిబ్బంది, ఎక్విప్‌మెంట్, మౌలిక వసతులను కల్పించినా క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రజలకు తగినంత నమ్మకం కల్పించలేకపోవడంతో గర్భిణులు, సాధారణ రోగులు దూర ప్రాంతాలకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నారు. కాగా మంగళవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 12 మంది రోగులు ఉండగా 2 గంటల సమయానికి 42 మంది చికిత్స పొందారు. వైద్యశాలల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఆరు కాన్పులు మాత్రమే జరిగినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

వైద్యాధికారి అలక్ష్యం



గంట మాత్రమే ఉండి వెళ్లిపోయిన వైద్యుడు

కలిగిరి : కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు బిజ్జం గీతారెడ్డి, సునీల్‌కుమార్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 9 గంటలకు వైద్యాధికారి సునీల్‌కుమార్ హాజరై కేవలం ఇద్దరు రోగులకు మాత్రమే వైద్యపరీక్షలు జరిపి వెళ్లిపోయారు. 104 వైద్యసేవల నిమిత్తం ఆయన వెళ్తున్నట్లు చెప్పినా ఆయన అక్కడకు కూడా వెళ్లకుండా అలక్ష్యంగా వ్యవహరించారు. కాగా మంగళవారం 81 మంది రోగులు వివిధ సమస్యలపై పీహెచ్‌సీకి వచ్చారు. వైద్యాధికారి గీతారెడ్డి వారికి వైద్యపరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఫార్మసిస్ట్ సెలవులో ఉన్నారు.

సిబ్బంది కొరత

సీతారామపురం : సీతారామపురం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత వేధిస్తుండటంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. ఇక్కడ ఒక వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సెకండ్ ఏఎన్‌ఎం ఒకరు దీర్ఘకాలికంగా విధులకు రావడం లేదు. ఒకే ఒక స్టాఫ్ నర్సుకు నైట్ డ్యూటీలు వేస్తుండడంతో పగలు ఓపీ సమయంలో హెల్త్ సూపర్‌వైజర్లతోనే మందులు పంపిణీ చేస్తూ వైద్యసేవలందిస్తున్నారు. పూర్తిస్థాయిలో సరిపడా మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులకు అరకొర మందులు అందిస్తున్నారు.

అందుబాటులో ఒకే డాక్టర్



వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి లక్ష్మి

జలదంకి : జలదంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు ఒక్క డాక్టర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. వైద్యాధికారులు లక్ష్మి, శ్రీనివాసులు వైద్య సేవలందించాలి. అయితే మంగళవారం వైద్యాధికారి లక్ష్మి మాత్రమే అందుబాటులో ఉన్నారు. శ్రీనివాసులు గురించి ఆరాతీయగా 104 వైద్యసేవల నిమిత్తం వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. కాగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి



రైతులకు సూచనలు చేస్తున్న డీఏఓ సత్యవాణి

మర్రిపాడు : రైతులు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి(డీఏఓ) సత్యవాణి పేర్కొన్నారు. మండలంలోని ఇర్లపాడు, చిలకపాడు గ్రామాల్లో మండల ఏఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈర్లపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి డీఏఓ హాజరై, పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని వరి పంటను పరిశీలించారు. కొందరు రైతులు వరిలో వెన్ను వస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వాతావరణ మార్పుల వల్ల ఇలా జరుగుతుందని, దీని నివారణకు ఎకరాకు 30 కిలోల యూరియాను 15 కిలోల పొటాష్‌ను చిరుపొట్ట దశలో వాడితే మొక్క ఆరోగ్యంగా పెరుగుతుందని తెలిపారు. ఏడీఏ శేషగిరి, వ్యవసాయ విస్తరణాధికారి కె.ఎంకటేశ్వర్లు, సహాయకులు రుక్మిణి, లక్ష్మీదేవి, లక్ష్మీలహరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం

ఉదయగిరి : స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సిమెంటురోడ్డు పనులను సర్పంచ్ పి.సామ్రాజ్యం మంగళవారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో దీనిని చేపడుతున్నారు. ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, వార్డు సభ్యుడు ఉప్పుటూరి శ్రీను, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు రియాజ్, ఉప్పుటూరి హరి, మాబాషా, యస్దాన్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అభినందన



కావలి : కుట్టు మెషీన్ ద్వారా మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న పట్టణానికి చెందిన పొన్నగంటి మాధవిని పలు సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు, మహిళలు మంగళవారం అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును మాధవి అందుకున్న నేపథ్యంలో ఆమెను పలువురు సత్కరించారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు



సంగం : మండలంలోని తరుణవాయి, ఉడ్‌హౌస్‌పేట గ్రామాల్లో దివంగత మాజీ జెడ్పీటీసీ తుంగా ఇందూదర్‌రెడ్డి జ్ఞాపకార్థం సర్పంచ్ బాలా శోభానాయుడు సహకారంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. నారాయణ వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఎముకలు, కంటి, గర్భకోశ, పిల్లల వైద్యులు పాల్గొని ప్రజలకు పలు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో తుంగా కార్తీక్ రెడ్డి, స్థానిక నేత నెల్లూరు కోటారెడ్డి ఉన్నారు.

ఎంపీడీఓ పరిశీలన



ఆత్మకూరు రూరల్ : మండలంలోని బోయలచిరివెళ్లలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం పర్యటించారు. పలు అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్తులతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ పద్ధతిలో నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకున్న గోకులం షెడ్లను తనిఖీ చేశారు. పంచాయతీ విస్తరణాధికారి డేవిడ్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్ పాల్గొన్నారు.

వైభవంగా కాశీనాయన జయంతి



సీతారామపురం : మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో అవధూత కాశీనాయన జయంతిని మంగళవారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం కాశీనాయన సంకీర్తనలు, సాయంత్రం మున్నెల్లివారి బావి నుంచి మంగళవాయిద్యాల నడుమ తెచ్చిన జలాలతో అభిషేకాలు, అర్చనలు గావించారు. రాత్రి 108 మంది మహిళలతో దివ్యజ్యోతి దర్శనం చేపట్టి రథోత్సవం చేశారు. వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాలకు చెందిన భక్తులు విశేషంగా తరలివచ్చారు.

ఆలయంలో చోరీకి యత్నం

సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని కామిరెడ్డిపాడులో ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించినట్లు అర్చకుడు లీలకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ గేట్లకున్న తాళాలను పగులగొట్టి హుండీని అపహరించేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. ఈ మేరకు అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అర్చకుడు మంగళవారం తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి



ఆత్మకూరు : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆత్మకూరు సీఐ జి.గంగాధర్ అన్నారు. ఎస్సైలు జిలానీ, సాయిబాబా, పోలీసు సిబ్బంది, సచివాలయాల పోలీస్ సిబ్బంది హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ బస్టాండ్ సమీపంలో ర్యాలీని ఉద్దేశించి ప్రజలకు సీఐ అవగాహన కల్పించారు.

జయప్రదం చేయండి



ఆత్మకూరు : ఆంధ్రా విద్యార్థి సంఘ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏవీఎస్ కార్యవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు మహాసభ బ్రోచర్లను ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, మున్సిపల్ వైస్ చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1వ తేదీన విశాఖపట్నంలో జరుగనున్న మహాసభల్లో విద్యార్థుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవీఎస్ సభ్యులు వినయ్, వర్ధన్, కిరణ్, సుభాన్, సుందర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారీకి చర్యలు



సీతారామపురం : చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారీకి చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ భార్గవి సూచించారు. ఆమె సీతారామపురంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. మంచి ఎరువులను విక్రయించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు రంగనాథ్‌రెడ్డి, జీవన్‌కుమార్, స్వచ్ఛభారత్ ఎంఆర్‌సీ ఖలీల్ ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

ఉదయగిరి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ అప్పాజీ ఉత్తమ అవార్డు అందుకున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక కార్యాలయ సిబ్బంది సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు. ఈఓపీఆర్డీ కరిముల్లా, పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ, వీరేంద్ర, డీఈఓ ఇమ్రాన్, ఇతర సిబ్బంది సమ్మద్, రంగనాయకులు పాల్గొన్నారు.